# పోలింగ్ ప్రశాంతం

- జిల్లాల్లో ఓటెత్తిన ప్రజలు
- భూపాలపల్లిలో 78.54 శాతం, ములుగులో 75.12 శాతం
- ఉదయం 7 నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు
- జయశంకర్ జిల్లాలో ఐదు, ములుగుజిల్లాలో నాలుగు గంటలలోపు వచ్చిన వారికి అవకాశం
- రాత్రి దాకా కొనసాగిన పోలింగ్ ప్రక్రియ
- ఓటు హక్కు వినియోగించుకున్న ప్రజాప్రతినిధులు, అధికారులు
- రెండు నియోజకవర్గాల పరిధిలో 620 పోలింగ్ కేంద్రాలు
- భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు



గొర్లవీడులో ఓటు వేసేందుకు బారులుతీరిన ప్రజలు

జయశంకర్ భూపాలపల్లి, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ) : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని భూపాలపల్లి నియోజకవర్గంలో సాధారణ అసెంబ్లీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. నియోజకవర్గంలోని భూపాలపల్లి, గణపురం, శాయంపేట, రేగొండ, మొగుళ్లపల్లి, చిట్యాల, టేకుమట్ల, గోరికొత్తపల్లి మండలాల్లో 317 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరుగగా మొత్తం 76.10శాతం పోలింగ్ నమోదైంది. గత ఎన్నికల్లో 82.13 శాతం పోలింగ్ కాగా ఈ ఎన్నికల్లో గత ఎన్నికలతో పోలిస్తే తక్కువ పోలింగ్ శాతం నమోదైంది. ఉదయం 7గంటల నుంచి పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కాగా మధ్యాహ్నం నుంచి ఓటింగ్ శాతం పెరిగింది. తొలిసారి ఓటు హక్కు వినియోగించుకునే వారు, యువ ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు అధిక సంఖ్యలో తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

నియోజకవర్గంలో 76.10శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం ఏజెంట్ల సమక్షంలో సిబ్బంది మాక్ పోలింగ్‌ను నిర్వహించి 7గంటలకు ఓటింగ్ ప్రక్రియను ప్రారంభించారు. ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకు 10.50శాతం ఓటింగ్ నమోదు కాగా, 9గంటల నుంచి 11గంటల వరకు 17.30 శాతం, 11 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 21.32 శాతం, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు 15.18 శాతం, సాయంత్రం 3గంటల నుంచి 5గంటల వరకు 11.80శాతం పోలింగ్ నమోదైంది. కొత్తగా 5వేల మంది యువకులు తొలిసారి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే యువ ఓటర్లు అధిక సంఖ్యలో తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

### ఓటు హక్కును వినియోగించుకున్న గండ్ర, సిరికొండ, కలెక్టర్

భూపాలపల్లి అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి భూపాలపల్లిలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి భూపాలపల్లిలోని తేజస్విని జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. గొర్లవీడు జిల్లా పరిషత్ హైస్కూల్లో రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి, పట్టణంలోని 79వ పోలింగ్ కేంద్రంలో కలెక్టర్ భవేశ్ మిశ్రా, జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, 33వ పోలింగ్ కేంద్రంలో ఆర్డీవో రమాదేవి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పోలింగ్ కేంద్రాలు తిరుగుతూ పోలింగ్ సరళిని పరిశీలించారు.

### మొగుళ్లపల్లిలో మొరాయించిన ఈవీఎంలు

మొగుళ్లపల్లి మండలంలో రెండు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో ఎన్నికల ప్రక్రియకు ఆటంకం ఏర్పడింది. సుమారు గంట పాటు ఓటర్లు క్యూ లైన్‌ల్లో నిల్చున్నారు. చిన్న చిన్న సమస్యలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. కలెక్టర్ భవేశ్‌మిశ్రా కంట్రోల్ రూం నుంచి వెబ్ క్యాస్టింగ్ ద్వారా పోలింగ్‌ను పర్యవేక్షించారు. ఎస్పీ కిరణ్ ప్రభాకర్ ఖారే బందోబస్తును పర్యవేక్షించారు. గురువారం రాత్రి వరకు ఆయా పోలింగ్ కేంద్రాల నుండి పోలింగ్ సిబ్బంది ఈవీఎంలను భూపాలపల్లిలోని అంబేద్కర్ స్టేడియంలో గల రిసెప్షన్ కౌంటర్‌లకు తరలించారు. అక్కడి నుండి కలెక్టర్, ఎస్పీ సమక్షంలో ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలకు తరలించారు.

### ములుగు జిల్లాలో..

ములుగు, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ) : ములుగు జిల్లాలోని ములుగు నియోజకవర్గంలోని 6 మండలాలతో పాటు భద్రాచలం నియోజకవర్గంలోని రెండు మండలాలలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ములుగు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆధ్వర్యంలో ములుగు నియోజకవర్గంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు జరిగిన పోలింగ్‌లో 75.12 శాతం పోలింగ్ నమోదు అయింది. ఉదయం 11గంటల వరకు మందకొడిగా సాగిన పోలింగ్ మధ్యాహ్నం వరకు వేగం పుంజుకొని 4గంటలకు పూర్తయింది. ఏజెన్సీ ప్రాంతాలలో 4లోపు వచ్చిన ఓటర్లందరినీ పోలింగ్ బూత్‌లోకి అనుమతించగా రాత్రి 7గంటల వరకు పోలింగ్ కొనసాగింది. బీఆర్‌ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతి తాడ్వాయి మండలంలోని ఆమె సొంత గ్రామం కాల్వపల్లిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ అభ్యర్థులు ములుగు మండలంలోని జగ్గన్నపేట ఆశ్రమ పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల పరిశీలకుడు రత్నాకర్‌ఝా ఇతర అధికారులతో కలిసి పోలింగ్ కేంద్రాలను సందర్శించడంతో పాటు ఓటింగ్ ప్రక్రియను కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యాలయంలో వెబ్ క్యాస్టింగ్ ద్వారా ఓటింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఎస్పీ గౌష్‌ఆలం ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు పటిష్ట బందోబస్తు నిర్వహించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు.



చిట్యాల మండలకేంద్రంలోని పాలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు



ములుగులో మొదటి సారి ఓటు హక్కును వినియోగించుకున్న యువతులు



భూపాలపల్లిలో మొదటి సారి ఓటు హక్కును వినియోగించుకున్న యువతులు



గొర్లవీడు పోలింగ్ స్టేషన్‌లో క్యూలైన్‌లో నిల్చున్న ఓటర్లు



ములుగు జిల్లా కేంద్రంలోని బాయ్స్ హైస్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద మహిళలు..



ఓటు హక్కును వినియోగించుకొని వస్తున్న మహిళలు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★రామకృష్ణ గ్రూప్ (AP, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. వృద్ధుల/పేషెంట్ల సేవకు వర్కర్లను 24x7 మీ ఇంటికి పంపగలము. 9281452762, 9515108830.
NT-314461

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
9182777213
WARANAGAL
9182777556
9182777557
9182777558
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565